క్లుప్తంగా

నేటి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పాన్‌గల్: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జబ్బార్, మండల కార్యదర్శి బాల్యానాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతదేశం ఇజ్రాయిల్ దేశానికి అందిస్తున్న సైనిక సహకారాలు వెంటనే నిలిపివేయాలని, పాలస్తీనా దేశంలో శాంతియుత వాతావరణం నెలకొల్పి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ సర్పంచ్‌లు జయరాములుసాగర్, కృష్ణయ్యసాగర్ అందజేశారు. గ్రామానికి చెందిన కుంటల ఈరయ్యకు రూ..47,500, కావలి గోవింద్‌కు రూ.32,500, కుర్వ తిరుపతయ్యకు రూ.12,500 చెక్కులను అందించారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొబ్బూరి రమేష్, పురేందర్, బుచ్చిరెడ్డి, రంగస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

ఖిల్లాఘనపురం: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీలను బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. వనపర్తి పట్టణంలోని ఐదో వార్డు ఒప్పతండాకు చెందిన నిఖిలకు రూ.2.5 లక్షలు, పెబ్బేరు మండలం తిప్పాయిపల్లికి చెందిన రాచూరి బాలకృష్ణకు రూ.2.5 లక్షలు, ఖిల్లాఘనపురం తండాకు చెందిన ఇస్లావత్ లాలికి రూ.75 వేల విలువ గల ఎల్‌ఓసీని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

వనపర్తిటౌన్: రైతు సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పాలన అందిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ నాయకులు రమేష్, పరశురాం, బొంబాయి మన్యంకొండ అన్నారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డుకు చెందిన రైతు గగనం శేఖర్ ఇటీవల మృతి చెదడంతో రైతుబీమా నుంచి మంజూరయిన చెక్కును భార్య గోదావరికి బుధవారం జిల్లా కేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫజల్, రమేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ తెలిపారు. కార్యాలయంలో 28–28–28 గ్రోమోర్ బస్తా రూ.1,700, బీపీటీ 5204 వరి రకం విత్తనాలు 25 కేజీల బస్తా రూ.1,138 అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని వ్యవసాయ అధికారులతో ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

బీసీ రిజర్వేషన్లు తేల్చాకే..

పాన్‌గల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టత వచ్చాకే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్‌నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని లేనిచో అన్ని పార్టీలను, బీసీ సంఘాల నాయకులను ఏకం చేస్తూ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. త్వరలోనే గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

తెమడ శాంపిళ్ల సేకరణ



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లిలో బుధవారం టీబీ క్యాంప్ (ఏసీఎఫ్)నిర్వహించారు. హెల్త్ అసిటెంట్ చంద్రమౌళి నలుగురు అనుమానితులను గుర్తించి వారితో శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, బీడీలు తాగరాదని, దగ్గినప్పుడు వచ్చే తెమడను ఎక్కడపడితే అక్కడ ఉమ్మరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



పాన్‌గల్‌లో..



జిల్లాకేంద్రంలో విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫలమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వల్లభ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫాంను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమం, కొత్తగా పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. గోపాల్‌పేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భాస్కర్‌నాయక్ తన కుమారుడిని ప్రైవేట్ పాఠశాల నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చేర్పించారని కొనియాడారు. తల్లిదండ్రులు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రణాళికబద్ధంగా నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ప్రయోజకులను చేయాలన్నారు.అనంతరం జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న మౌలిక వసతుల మరమ్మతు పనులు గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి మొహమ్మద్ అబ్దుల్‌ఘనీ, సీఎంఓ యుగంధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులపై నమ్మకం

పాన్‌గల్: ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు నమ్మకం పెరగడంతో విద్యార్థులను చేర్పుతున్నారని పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మ అన్నారు. బుధవారం పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు చేరారని, వీరితో కలుపుకొని ఇప్పటి వరకు పాఠశాలలో 44 మంది కొత్తగా అడ్మిషన్ పొందినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామన్నారు.

జూనియర్ కళాశాలలో లక్ష్యం చేరాలి

వనపర్తి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యార్థుల ప్రవేశాలు జరగే విధంగా లెక్చరర్లు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని సంక్షేమ శాఖల అధికారులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామంలో పదో తరగతి ఉత్తీర్ణత పొందిన అమ్మాయిలు, అబ్బాయిలను గుర్తించి ప్రభుత్వ కళాశాలలో చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి పూర్తి కాగానే అమ్మాయిలను కళాశాలకు పంపించకుండా బాల్య వివాహాలు చేస్తున్నారని, వీటిపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం లేక, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు సరిపడా లేకపోవడంతో పిల్లలు రాలేక పోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ ఆయా రూట్లలో బస్సులు నడిపే విధంగా, కళాశాల వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సు ఆపే విధంగా చూడాలని ఆర్‌టీసీ ట్రాఫిక్ అధికారిని ఆదేశించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ మూడో అధికారి అంజయ్య, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఉమాదేవి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దీన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి వసతి కల్పించండి



మాట్లాడుతున్న రాఘవేంద్ర

అమరచింత: మండలంలోని పాంరెడిపల్లి శివారులో ఉన్న కేజీబీవీకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన డీవైఎఫ్‌ఐ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలకు వెళ్లే దారి గుంతలమయంగా మారడం, వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి వేళలో అటు వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కస్తూర్బా పాఠశాల వరకు రహదారిని నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మంత్రి వాకిటి శ్రీహరి విద్యార్థినుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే రహదారి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి చంటి, సాగర్, రసూల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

ఆత్మకూర్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, బాలల హక్కులను పరిరక్షించాలని తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీపాద్, ఎస్‌ఐ నరేందర్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్లు స్వరూప, రవిరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధశాఖల అధికారులు, పంచాయ తీ కార్యదర్శులకు మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని, పోక్సో చట్టం, మిషన్ వాత్సల్య, అనాథ బాలల దత్తత, బాల్యవివాహాల నిషేధచట్టం 2006, బాలకార్మికుల నిషేధచట్టం, బాలరక్షక్‌భవన్, చైల్డ్‌హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీ నంబర్ 1098, 181, 100 ల గురించి క్లుప్తంగా వివరించారు.

అల్లుడిపై మామ దాడి: కేసు నమోదు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన రంజిత్ రెడ్డికి 15ఏళ్ల క్రితం నర్వ మండలంలోని చిన్నకడుమూర్ గ్రామానికి చెందిన సృజనతో వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రంజిత్‌రెడ్డి ప్రైవేట్ జాబ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 16న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గొడవ జరిగిన విషయాన్ని సృజన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పడంతో కొత్తకోటకు వచ్చిన ఆమె తండ్రి హన్మంత్‌రెడ్డి ఆగ్రహంతో కట్టెతో రంజిత్‌రెడ్డిపై దాడి చేశాడు. ఈ దాడిలో రంజిత్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి.రంజిత్‌రెడ్డి తన మేనమామ రవీందర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఆయన వచ్చి బాధితుడిని ఆస్పత్రికి తరలించాడు. రంజిత్‌రెడ్డి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

మహిళను దూషించిన ఘటనలో..

పాన్‌గల్: వివాహిత మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి, ఆమె దూషించిన ఘటనలో బుధవారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం .. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన బండారు శంకరమ్మ ఈ నెల 17న కేతేపల్లిలో ఆర్టీసీ బస్సు దిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో కేతేపల్లి గ్రామ శివారులో బాల్‌రెడ్డి మామిడితోట సమీపంలో నలుగురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై వచ్చి మద్యం మత్తులో మహిళను అడ్డగించి ఆమె చేతులు పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించి దూషించారు. నలుగురిలో ఇద్దరు వ్యక్తులు కల్వరాల గ్రామానికి చెందిన ఆంజనేయులుచారి, మాధవచారిలుగా గుర్తించగా.. మిగతా ఇద్దరిని గుర్తుపట్టలేదని బాధిత మహిళ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి



వనపర్తిలో మురుగు కాల్వను శుభ్రం చేయిస్తున్న పుర కమిషనర్ వెంకటేశ్వర్లు

వనపర్తిటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉంటేనే వాటి బారిన పడకుండా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని 1, 2, 3, 30వ వార్డుల్లో 100 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం తడి, పొడి చెత్త విభజన, ఏబీసీ ప్రచారం, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా 23, 28వ వార్డుల్లో ఎస్‌ఎల్‌ఎఫ్ సమావేశం, 15, 22, 25, 29, 32వ వార్డుల్లో పిచ్చి చెట్ల తొలగించి, డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొనారు.

ఆత్మకూర్/అమరచింత: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రం, అమరచింత పట్టణంలోని 9వ వార్డులో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా స్థానికులకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తిచెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం

చిన్నంబావి: బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కొత్తవారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మండల కమిటీని మార్పు చేశామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్ అన్నారు. ఆయన బుధవారం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా పార్టీ కోసం జగ్గారి శ్రీధర్‌రెడ్డి చాలా కష్టపడ్డారని, ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. చిన్నంబావి మండలంలో బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడమే గాక పార్టీ కార్యక్రమాలు అన్నింటిని విజయవంతం చేయడంలో శ్రీధర్‌రెడ్డి పాత్ర కీలకంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాకేష్, నాగారాజు, కురుమయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

అమరచింత: పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం ఇచ్చారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మున్సిపాలిటీ కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మరమ్మతుతో పాటు కొత్తగా ప్రధాన కూడళ్లు, బస్టాండ్ రహదారులు, వీధి చౌరస్తాల్లో వీటిని అమర్చి చోరీలతో పాటు అసాంఘీక కార్యక్రమాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేట్లకు వనరులు దోచిపెట్టేందుకే ‘ఆపరేషన్ కగార్’



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: కార్పొరేట్ శక్తులకు అటవీ వనరులను దోచిపెట్టేందుకే బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండ, మావోయిస్టుల చంపుతూ హింసను ప్రేరేపిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న జరగబోయే రాజ్‌భవన్ ముట్టడికి అందరూ ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీసీ నాయకుడు గోపాలకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి ఎత్తం విష్ణు, నాయకులు రామకృష్ణ, చందు, రాజేష్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

పాన్‌గల్: ఇంట్లో వారికి సమాచారం ఇవ్వకుండా మైనర్ బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న ఉదయం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన మైనర్‌ను కోడేరు మండలంలోని నార్యానాయక్ తండాకు చెందిన ముడావత్ చింటూ అనే యువకుడు తీసుకెళ్లాడు. బాలికను తీసుకెళ్లిన ముడావత్ చింటుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నరేందర్ సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై స్థానికులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అపరచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌ను నమ్మకూడదని, ఆధార్ అప్‌డేట్ అని, వాట్సాప్‌లో నగ్న వీడియోలు ఉన్నాయని, సైబర్‌క్రైం పోలీసులమని, లింకులను ఓపెన్ చేయమని తదితర కాల్స్, మెసేజ్‌లను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, హెచ్‌సీలు మన్నెపురెడ్డి, గుప్త, సిబ్బంది రమేష్, హరికృష్ణ, సురేందర్, భూపాల్, రాములు, పుష్పలత, కృష్ణవేణి, స్థానికులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేందర్

పెబ్బేరు రూట్‌లో ప్రయాణం నరకప్రాయం

- ఏడాది కాలంగా మరమ్మతులకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- ఇరుకు రహదారి పక్కనే కేబుల్ కోసం తవ్విన గుంతలు



పెబ్బేరు ఫారెస్ట్ రూట్‌లో రహదారి ఇలా..



రహదారి పక్కన కేబుల్ కనెక్షన్ కోసం గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రం నుంచి పెబ్బేరు వెళ్లే రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. వనపర్తి శివారు నుంచి నాచహళ్లి వరకు అటవీ ప్రాంతంలో రోడ్డు ఉండడం, రాత్రిపూట చిమ్మచీకట్లు నెలకొనడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూల్, పెబ్బేర్, గద్వాల తదితర ప్రాంతాలకు ఈ రహదారి గుండానే రాకపోకలు కొనసాగుతాయి. ఈ ప్రాంతాల్లోని రహదారి ఫారెస్ట్ ఆధీనంలో ఉండటం, దీనికి తోడు రోడ్డు కూడా చిన్నదిగా ఉంటుంది. ఈ రహదారిలో 8 కిలో మీటర్ల వరకు అడుగడుగున గుంతలే దర్శనమిస్తాయి. రహదారి మరమ్మతుకు అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా.. అవి నాలుగైదు రోజులకు మించి ఉపశమనం కలిగించడం లేదు. చిన్నపాటి వర్షం పడితే గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడిన ఘటనలు కోకొల్లలు. ఈ రహదారిని పునర్నిర్మించేందుకు ఏడాది కిందట ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మాత్రం మంజూరు కాలేదు.

పొంచి ఉన్న మరో ప్రమాదం

అసలే రోడ్డు గుంతలమయంగా ఉండి ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఇదే రోడ్డులో ఓ ప్రైవేట్ కేబుల్ వేసుకునేందుకు అధికారులు అనుమతులిచ్చారు. 20 నుంచి 30 అడుగులలోపు ఉన్న ఈ రహదారి చుట్టుపక్కల పల్లపు ప్రాంతం, విపరీతమైన మలుపులు ఉన్నాయి. దీనికితోడు కేబుల్ వేసేందుకు తీసిన గుంతల కారణంగా రోడ్డు మరింత ఇరుకుగా మారింది. దీంతో పగటి పూట కూడా వాహనాలు నడపడం ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. వాహనం ఏ మాత్రం అదుపు తప్పిన కేబుల్ గుంతలు పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు. కొన్ని చోట్ల కేబుల్ లైన్లు పూడ్చేసిన పూర్తిస్థాయిలో వాటిపై మట్టి వేయకపోవడంతో అవి కుంగిపోతున్నాయి.

అధికారులు చర్యలు చేపట్టాలి



రహదారిని అధికారులు ఏ మాత్రం మెరుగుపరచడం లేదు. దీనికి తోడు తవ్విన కేబుల్ లైన్లు అలాగే వదిలేయడంతో ప్రమాదం ఎప్పుడు ఎలా వస్తుందోనని భయపడాల్సి వస్తుంది. ఈ దారిలో ఎంత నెమ్మదిగా ప్రయాణించిన గుంతల కారణంగా వాహనదారులతో పాటుగా ప్రయాణికులకు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎత్తం మహేష్

త్వరలోనే పరిష్కరిస్తాం

పెబ్బేరు రోడ్డు మెరుగుపరిచేందుకు ఏడాది కిందట నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రహదారి రూపురేఖలు మారుతాయి. రహదారి వేయాలన్నా ఫారెస్ట్ అధికారుల అనుమతి తప్పనిసరి. కేబుల్ లైన్ తవ్వకాలకు ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇచ్చారు. తవ్వకాలను త్వరగతిన పూడ్చాలని ప్రతీ రోజు నిర్వాహకులకు సూచిస్తున్నాం. త్వరలోనే కేబుల్ కనెక్షన్ గుంతలను పూడ్చేలా చూస్తాం.

– రాకేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న భరత్‌భూషణ్

కొత్తకోట: పట్టణం అభివృద్ధి చెందకపోవడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకుడు భరత్‌భూషణ్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న, చిన్న మండల కేంద్రాల్లో సైతం 30, 50 పడకల ఆస్పత్రులు ఉంటే కొత్తకోట మండల కేంద్రం మాత్రం ఆరు పడకల ఆస్పత్రిగా కొనసాగడం సిగ్గుచేటన్నారు. 2023లో 15వ ఫైనాన్స్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.5.75 కోట్లతో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తే ఎందుకు పనులు ప్రారంభించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణంలో సంవత్సరానికి 1,200 నుంచి 1,300 మంది విద్యార్థులు ఇంటర్ ఉత్తీర్ణత పొందుతుంటే, ఎందుకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, రాఘవేందర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, తిరుపతయ్య సాగర్, జనంపల్లి ఏలియా, రవీందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత



వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన వడ్డె రవికుమార్ విద్యుదాఘాతంతో ఇటీవల మరణించాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం విద్యుత్ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర 1104 విద్యుత్ సంఘ ప్రధాన కార్యదర్శి సాయిబాబు, విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి కోటయ్య, కమలేశ్వర్‌రావు, సత్యనారాయణగౌడ్, భాస్కర్‌రెడ్డి, చిన్నారెడ్డి, వేణుమాధవరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

అమరచింత: అంగన్‌వాడీ లబ్ధిదారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించి హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లు తమ క్లస్టర్ పరిధిలోని చిన్నారులకు విద్యాబుద్ధులతో పాటు పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదల కోసం కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ కళాశాల్లో చేర్పించండి

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాల్లో వసతులతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులు తమపిల్లలను ప్రైవేటు కళాశాలలకు కాకుండా ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని అధ్యాపకులు ఏకే కురుమూర్తి, విశ్వాస్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని అభ్యర్థించారు.